తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాద్రాద్రి భువనగిరి
శనివారం 20 జూన్ 2026
పేజీలు : 8
Follow :







వైద్య రంగం వ్యాపారమయమైపోతున్న నేటి రోజుల్లో... వైద్యం అంటే కేవలం లాభాలు ఆర్జించడం కాదు, ప్రాణాలు నిలబెట్టే పరమ పవిత్రమైన సేవ అని నిరూపించింది ఖమ్మంలోని ప్రముఖ 'కూరపాటి చిల్డ్రన్ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్'. కాసుల కోసం కాకుండా కన్నీళ్లు తుడవడమే ధ్యేయంగా పెట్టుకున్న ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ మరోసారి తన పెద్ద మనసును చాటుకున్నారు. మహానగరాల్లోని కార్పొరేట్ ఆసుపత్రులు సైతం చేతులెత్తేసే సంక్లిష్టమైన బ్రెయిన్ ట్యూమర్ శస్త్రచికిత్సను, అత్యంత తక్కువ ఖర్చుతోనే ఇక్కడి కూరపాటి చిల్డ్రన్ అండ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో విజయవంతంగా పూర్తి చేసి, ఆ పేద చిన్నారికి పునర్జన్మను ప్రసాదించారు.

ఖమ్మం బ్యూరో, జూన్ 19 (జనంసాక్షి):

# కూరపాటి కరుణామృతం



పేదరికంపై గెలిచిన మానవత్వం

- బాలుడికి బ్రెయిన్ ట్యూమర్ సర్జరీ సక్సెస్
- వాణిజ్యం కాదు... వైద్యమే పరమార్థమని చాటిన చైర్మన్ డాక్టర్ ప్రదీప్ కుమార్
- కూరపాటి వైద్య బృందం అద్భుత సృష్టి
- 72 గంటల్లోనే నడిచిన చిన్నారి ఆషీర్

వార్తా లోపలి పేజీలో

## లంచగొండి అధికారిపై ఏసీబీ ఉచ్చు..

సర్వే నివేదిక కోసం లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన డిప్యూటీ ఇన్‌స్పెక్టర్




**నల్లగొండ ప్రతినిధి,జూన్ 19,(జనంసాక్షి):** భూ సర్వే నివేదిక జారీకి లంచం డిమాండ్ చేసి తీసుకుంటుండగా నల్లగొండ ఆర్డీఓ కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జి. పవన్ కుమార్‌ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శుక్రవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.ఏసీబీ డీఎస్పీ జగదీష్ చంద్ర తెలిపిన వివరాల ప్రకారం, భూ సర్వే నివేదిక జారీ చేసేందుకు ఫిర్యాదిదారుని నుంచి మొత్తం రూ.35 వేల లంచం డిమాండ్ చేసిన పవన్ కుమార్, ముందుగానే రూ.20 వేల అడ్వాన్స్‌గా తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మిగిలిన రూ.15 వేల లంచం తీసుకుంటుండగా నల్లగొండ కలెక్టరేట్ సమీపంలో ఏసీబీ అధికారులు ట్రాప్ నిర్వహించి అతడిని పట్టుకున్నారు.నిందితుడి వద్ద నుంచి రూ.15 వేల నగదును స్వాధీనం చేసుకున్న అధికారులు, అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. విధుల నిర్వహణలో అక్రమ ప్రయోజనం పొందినట్లు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌ను అరెస్ట్ చేసినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.నిందితుడిని నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరుస్తామని, కేసు దర్యాప్తు కొనసాగుతోందని డీఎస్పీ జగదీష్ చంద్ర తెలిపారు.ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేసినట్లయితే ప్రజలు వెంటనే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

## దారుణ రోడ్డు ప్రమాదం

ముగ్గురు దుర్మరణం

ఇద్దరికి తీవ్ర గాయాలు



2లో

## కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో స్వీపర్ పోస్ట్ భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మండల విద్య అధికారి మల్లికార్జున రావు





**నాంపల్లి, జూన్ 19 (జనంసాక్షి):** నాంపల్లి మండల కేంద్రంలోని గల కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో స్వీపర్ -1 పోస్టు భర్తీ చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మండల విద్యాధికారి కే.మల్లికార్జున రావు తెలిపారు. దరఖాస్తుదారులు ఏడవ తరగతి చదువుకునీ ఉండాలని ఈ పోస్టు తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయడం జరుగుతుందని ఆసక్తి కలిగిన వారు జూన్ 20 నుండి 22వ తారీకు సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులు చేసుకోవాలని దరఖాస్తులను నాంపల్లి కస్తూర్బా గాంధీ గురుకుల బాలికల పాఠశాలలోని ప్రత్యేక అధికారికి సమర్పించాలని నాంపల్లి మండల విద్యాశాఖ అధికారి కే .మల్లికార్జునరావు అన్నారు. తగిన అర్హతను బట్టి భర్తీ చేయడం జరుగుతుందని అన్నారు.

## విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల టెక్స్ బుక్స్, కంప్యూటర్ ల్యాబ్‌ను సందర్శించి, విద్యార్థులకు అందుతున్న డిజిటల్ విద్యపై ఉపాధ్యాయులను వివరాలు అడిగారు.మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును తెలుసుకోవడానికి కిచెన్ షెడ్‌ను, పాఠశాలలోని టాయిలెట్లను తనిఖీ చేశారు.విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.అనంతరం పదవ తరగతి గదిలోకి వెళ్ళిన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అక్కడ కాసేపు ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థిని, విద్యార్థులతో ముచ్చటించారు.వారి చదువుల తీరును, భవిష్యత్తు లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల భాషా నైపుణ్యాలను పరీక్షించడానికి స్వయంగా వారి చేత తెలుగు పాఠ్యపుస్తకాన్ని చదివించారు.స్పష్టమైన ఉచ్చారణతో చదివిన విద్యార్థులను అభినందించారు. పదవ తరగతి విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని, పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ అశోక్, జీహెచ్ఎం గోలీ పద్మ, మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి, అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## 2వ విడత ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలు పారదర్శకంగా జరగాలి

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**దేవరకొండ, జూన్ 19(జనంసాక్షి)** పేద ప్రజల సొంత ఇంటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. శుక్రవారం 2వ విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియపై హౌసింగ్ శాఖ అధికారులు, ఎంపీడీవోలు ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో వారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఇందిరమ్మ ఇండ్ల అమలు, అర్హుల ఎంపిక, ప్రభుత్వ మార్గదర్శకాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలో 226 గుడిసెలు ఉన్నట్లు అధికారులు గుర్తించారని, ఆ కుటుంబాలందరికీ ప్రభుత్వ నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే స్లాబ్ లేకుండా కేవలం గోడలతో ఉన్న అసంపూర్తి ఇళ్లకు పైకప్పు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్న విషయాన్ని ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులను ఇందిరమ్మ ఇండ్ల పథకానికి అనర్హులుగా ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో అర్హతల పరిశీలనను కచ్చితంగా నిర్వహించాలని తెలిపారు. మొదటి విడతలో ఎక్కడైనా సాంకేతికపరమైన లోపాలు లేదా అవకతవకలు చోటుచేసుకుని ఉంటే, రెండో విడతలో అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో హౌసింగ్ శాఖ అధికారులు, ఎంపీడీవోలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# దారుణ రోడ్డు ప్రమాదం

## ముగ్గురు దుర్మరణం, ఇద్దరికి తీవ్ర గాయాలు





**పెద్దవూర జూన్ 19 (జనంసాక్షి)**
రాంగ్ రూట్‌లో అతివేగంగా వచ్చిన కారు ఎదురుగా వస్తున్న మరో కారును బలంగా ఢీకొట్టిన సంఘటనలో ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన గురువారం రాత్రి నల్గొండ జిల్లా పెద్దవూర మండల పరిధిలో చోటుచేసుకుంది.

**ప్రమాదం జరిగిందిలా**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం కొంకవారిపాలెం గ్రామానికి చెందిన కాకర్ల తోమాసయ్య (59), అతని చిన్న కుమారుడు కాకర్ల ప్రకాష్ రావు (35, ప్రైవేట్ టీచర్) కలిసి గురువారం (జూన్ 18) సాయంత్రం 6.00 గంటల సమయంలో హైదరాబాద్ నుండి నాగార్జునసాగర్‌లోని సాగర్ మాత గుడికి బయలుదేరారు. ఇందుకోసం వారు హయత్ నగర్‌కు చెందిన ఎరకల ప్రవీణ్‌కు చెందిన కారు (ఏఉ-07-చి-2713) ను కిరాయికి మాట్లాడుకున్నారు.
వారు ప్రయాణిస్తున్న కారు రాత్రి అందాజ 10.00 గంటల సమయంలో పెద్దవూర మీదుగా రామన్నగూడెం తండా శివారులోకి చేరుకుంది. అదే సమయంలో నాగార్జున సాగర్ వైపు నుండి పెద్దవూర వైపు వస్తున్న మారుతి సుజుకి చీఒ6 కారు (ఋా-31-ఉ-9530) డ్రైవర్ గొర్రె రామకృష్ణ, కారును అతివేగంగా, నిర్లక్ష్యంగా రాంగ్ రూట్‌లో నడుపుకుంటూ వచ్చి తోమాసయ్య, ప్రకాష్ రావు ప్రయాణిస్తున్న కారును ఎదురుగా బలంగా ఢీకొట్టాడు.

**ముగ్గురు అక్కడికక్కడే మృతి**
ఈ ఘోర ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న కాకర్ల తోమాసయ్య, అతని కుమారుడు కాకర్ల ప్రకాష్ రావు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వీరితో పాటు ఎదురుగా ఢీకొట్టిన మారుతి సుజుకి చీఒ6 కారులో ఉన్న హనుమకొండ జిల్లా అచ్చంపేటకు చెందిన రావుల సాయికుమార్ కూడా తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు.

**ఇద్దరికి తీవ్ర గాయాలు**
ఈ ప్రమాదంలో హైదరాబాద్ కారు డ్రైవర్ ఎరకల ప్రవీణ్‌తో పాటు, చీఒ6 కారులో ప్రయాణిస్తున్న కొర్ర సాయి అనే మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి మృతుల శవాలను, గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నాగార్జునసాగర్ ఆసుపత్రికి తరలించారు.

**కేసు నమోదు - అధికారుల పరిశీలన**
మృతుడు తోమాసయ్య పెద్ద కుమారుడు కాకర్ల అంతయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెద్దవూర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు..శుక్రవారం (జూన్ 19) ప్రమాద స్థలాన్ని పోలీస్ ఉన్నతాధికారులు శరత్ చంద్ర పవర్, ఆది రెడ్డి, నాగార్జునసాగర్ సిఐ బి. శ్రీను నాయక్, పెద్దవూర ఎస్సై జె. గోపాల్ రావు, మరియు నాగార్జునసాగర్ ఎస్ ఐ సతీష్‌లు సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి, క్షేత్రస్థాయిలో వివరాలను సేకరించారు.



## కల్లూరులో ఎరువులు, విత్తనాల దుకాణాల్లో వ్యవసాయ, పోలీసు అధికారుల తనిఖీలు

**కల్లూరు జూన్ 19(జనం సాక్షి)**
నకిలీ విత్తనాలు అరికట్టేందుకు పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులు ఉమ్మడిగా కల్లూరు మండలంలోని ఎరువులు, విత్తనాలు అమ్మకం దుకాణాలలో ఎస్సై హరిత, వ్యవసాయ శాఖ ఏవో రూప శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ ఏవో ఆధ్వర్యంలో కల్లూరు లోని ఫర్టిలైజర్స్ అండ్ సీడ్స్ షాపులను సందర్శించి, విక్రయాల రికార్డులు, స్టాక్ వివరాలు, లైసెన్సులు, బిల్లుల నిర్వహణ, నిల్వల పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులకు విక్రయిస్తున్న విత్తనాలు, ఎరువులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని ఆరా తీశారు. అలాగే ప్యాకెట్లపై ఉన్న వివరాలు, తయారీ తేదీలు, గడువు తేదీలు, కంపెనీ గుర్తింపు తదితర అంశాలను పరిశీలించారు.రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు. బిల్లు లేకుండా కొనుగోలు చేసిన వస్తువుల విషయంలో భవిష్యత్తులో సమస్యలు తలెత్తితే చర్యలు తీసుకోవడంకష్టమవుతుందని తెలిపారు. అలాగే అనుమానాస్పదంగా కనిపించే విత్తనాలు లేదా ఎరువుల గురించి వెంటనే వ్యవసాయ శాఖఅధికారులకుసమాచారం అందించాలని కోరారు.

# ప్రభుత్వ బడికి పట్టం..

## ప్రైవేటుకు దీటుగా దెందుకూరు పాఠశాల!

- వివిధ ప్రవేటు పాఠశాలల నుంచి దెందుకూరు ప్రాథమిక పాఠశాలలో భారీ చేరికలు
- మధిర మండలానికే ఒక ఆదర్శంగా దెందుకూరు ప్రాథమిక పాఠశాల
- పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులను అభినందించిన సీఎంఓ అధికారి

**మధిర, జూన్ 19 (జనంసాక్షి):**
బడుల్లో నాణ్యమైన విద్య దొరుకుతుందా?"అన్న సంశయాలకు మధిర మండలంలోని దెందుకూరు ప్రాథమిక పాఠశాల (ఎస్సీ కాలనీ పాఠశాల)గట్టి సమాధానం చెబుతోంది.ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న అత్యాధునిక వసతులు,ఉపాధ్యాయుల నిబద్ధతతో కూడిన బోధన ఇప్పుడు తల్లిదండ్రుల నమ్మకాన్ని గెలుచుకుంటోంది.ప్రైవేటు పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని రీతిలో ఈ పాఠశాల రూపుదిద్దుకోవడంతో, చుట్టుపక్కల ప్రాంతాల విద్యార్థులు ఈ బడి వైపు పరుగులు తీస్తున్నారు.

**విద్యార్థుల రాకతో పెరిగిన కళ**
దెందుకూరు ప్రాథమిక పాఠశాలలో అందుతున్న విద్యాబోధనపై నమ్మకంతో, వివిధ ప్రైవేటు విద్యాసంస్థల నుంచి విద్యార్థులు బారులు తీరారు. కేవలం ఇటీవల కాలంలోనే సుమారు 32 మంది విద్యార్థులు ప్రైవేటు బడుల నుంచి వచ్చి ఇక్కడ చేరడం విశేషం. దీంతో పాఠశాలలోని మొత్తం విద్యార్థుల సంఖ్య 82కు చేరి, క్యాంపస్ అంతా సందడిగా మారింది.

**క్షేత్రస్థాయిలో సీఎంఓ పరిశీలన**
దెందుకూరు ప్రాథమిక పాఠశాలను ?శుక్రవారం సందర్శించిన సీఎంఓ అధికారి భభోజీ ప్రవీణ్ కుమార్,తరగతి గదుల్లోని విద్యా ప్రమాణాలను స్వయంగా పరిశీలించారు.విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను, ఉపాధ్యాయుల బోధనా శైలిని దగ్గరుండి గమనించిన ఆయన, ప్రభుత్వం కల్పిస్తున్న వసతులపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా పాఠశాల ప్రాంగణంలో నెలకొన్న పరిశుభ్రత, టాయిలెట్ల నిర్వహణను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

**సిబ్బంది పెంచాలి : ప్రధానోపాధ్యాయుల విన్నపం**
విద్యార్థుల సంఖ్య అనూహ్యంగా పెరగడంతో, నాణ్యమైన బోధనను నిరంతరాయంగా కొనసాగించడానికి అదనపు సిబ్బంది అవసరమని ప్రధానోపాధ్యాయులు డి. [illegible] భవిష్యత్తును అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులు,డి శ్యామలారావు,జి. సునీత, బండారు నాగరాజు కృషిని సీఎంఓ ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలలు కేవలం అక్షరాలను నేర్పే చోటుగానే కాకుండా, వ్యక్తిత్వ వికాసాన్ని కూడా అందించే కేంద్రాలుగా మారుతున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.దెందుకూరు ప్రాథమిక పాఠశాల ఇప్పుడు మధిర మండలానికే ఒక ఆదర్శంగా నిలిచి, ప్రభుత్వ విద్యపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని రెట్టింపు చేస్తోంది అని అన్నారు.



### తాళ్లపెంట గ్రామపంచాయితీ లో

# అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

## మురుగు నీరు నిల్వలు, పేరుకు పోయిన చెత్తా చెదారం దర్శనం

**పెనుబల్లి, జూన్ 19(జనంసాక్షి)**
పెనుబల్లి మండలం తాళ్లపెంట గ్రామపంచాయతీ కొత్తూరు కాలనీలో మురుగు కాలువలు లేక వర్షపు నీరు ఇళ్లలోకి పారుతోంది.కాలనీలో సీసీ రహదారులు ఉన్నా ఇళ్లలో వాడే నీరు,వర్షపు నీరు వెళ్లే మార్గం లేదు. మురుగు నీరు నిల్వవడంతో చెత్తా చెదారం పేరుకుపోయి దుర్వాసన కొడుతుంది. చుట్టుప్రక్కల ఉన్న పంట పొలాలలోని నీరు నివాస గృహాల మీదగా రహదారిపై ప్రవహిస్తుంది. మురుగు నీటి నిల్వతో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. పంచాయతీ పాలకవర్గం, అధికారులు పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయడంతో పాటు శాశ్వతంగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.





వైద్య రంగం వ్యాపారమయమైపోతున్న నేటి రోజుల్లో... వైద్యం అంటే కేవలం లాభాలు ఆర్జించడం కాదు, ప్రాణాలు నిలబెట్టే పరమ పవిత్రమైన సేవ అని నిరూపించింది ఖమ్మంలోని ప్రముఖ 'కూరపాటి చిల్డ్రన్ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్'. కాసుల కోసం కాకుండా కన్నీళ్లు తుడవడమే ధ్యేయంగా పెట్టుకున్న ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ మరోసారి తన పెద్ద మనసును చాటుకున్నారు. మహానగరాల్లోని కార్పొరేట్ ఆసుపత్రులు సైతం చేతులెత్తేసే సంక్లిష్టమైన బ్రెయిన్ ట్యూమర్ శస్త్రచికిత్సను, అత్యంత తక్కువ ఖర్చుతోనే ఇక్కడి కూరపాటి చిల్డ్రన్ అండ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో విజయవంతంగా పూర్తి చేసి, ఆ పేద చిన్నారికి పునర్జన్మను ప్రసాదించారు.

ఖమ్మం బ్యూరో, జూన్ 19 (జనంసాక్షి):




# కూరపాటి కరుణామృతం

## పేదరికంపై గెలిచిన మానవత్వం

- బాలుడికి బ్రెయిన్ ట్యూమర్ సర్జరీ సక్సెస్
- వాణిజ్యం కాదు... వైద్యమే పరమార్థమని చాటిన చైర్మన్ డాక్టర్ ప్రదీప్ కుమార్
- కూరపాటి వైద్య బృందం అద్భుత సృష్టి
- 72 గంటల్లోనే నడిచిన చిన్నారి ఆషీర్





**కల్లోలంలో కన్నవారి గుండె...**

ఖమ్మం జిల్లా తల్లంపాడు గ్రామానికి చెందిన జి.ఆషీర్ అనే ఆరేళ్ల బాలుడు ఈ నెల 12న తీవ్రమైన ఫిట్స్‌తో బాధపడుతూ కూరపాటి ఆసుపత్రిలో చేరాడు. బాలుడి పరిస్థితిని చూసి చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్, డాక్టర్ బ్రహ్మ కుమార్ వెంటనే అప్రమత్తమయ్యారు. అత్యవసరంగా చేసిన సిటీ స్కాన్, ఎంఆర్ఐ పరీక్షల్లో బాలుడి మెదడు లోపలి భాగంలో ప్రమాదకరమైన ట్యూమర్ ఉన్నట్లు తేలింది. తక్షణమే ఆపరేషన్ చేయకపోతే ప్రాణాలకే ముప్పని వైద్యులు నిర్ధారించారు. మహానగరాల్లో ఈ ఆపరేషన్‌కు అయ్యే ఖర్చు భరించే స్తోమత లేక, కళ్ల ముందే కన్నబిడ్డ ప్రాణం కొట్టుమిట్టాడుతుంటే ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

**అండగా నిలిచిన అభయహస్తం..**

దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ పేద దంపతులు కూరపాటి ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్‌ను ఆశ్రయించి తమ ఆవేదనను వెళ్లగక్కారు. వారి దీనగాథను వినడమే ఆలస్యం డాక్టర్ ప్రదీప్ కుమార్ గుండె చలించింది. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఒక పసిప్రాణం పోకూడదు... మీరు ధైర్యంగా ఉండండి, బాధ్యత నాది.. అంటూ అభయమిచ్చారు. వాణిజ్య విలువలను పక్కనబెట్టి, మానవీయ కోణంలో అత్యంత తక్కువ ఖర్చుతోనే ఆసుపత్రిలోనే శస్త్రచికిత్స చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశారు.

**కూరపాటి వైద్యుల 'అద్భుత సృష్టి'**

ఈ నెల 14న డాక్టర్ ప్రదీప్ కుమార్ పర్యవేక్షణలో కూరపాటి ఆసుపత్రికి చెందిన నిపుణులైన వైద్య బృందం రంగంలోకి దిగింది. ప్రముఖ పీడియాట్రిక్ న్యూరో సర్జన్ డాక్టర్ తరంగ్ వోరా, అనస్తీసియా నిపుణులు డాక్టర్ రవి కుసుమరాజు, ఓటి టెక్నీషియన్స్ రవి, అభిరామ్‌ల బృందం గంటల తరబడి శ్రమించి, అత్యంత క్లిష్టమైన ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. మెదడులోని ట్యూమర్‌ను అత్యంత సురక్షితంగా తొలగించారు.

కూరపాటి వైద్యుల నైపుణ్యానికి నిదర్శనంగా ఆపరేషన్ జరిగిన కేవలం 72 గంటల్లోనే చిన్నారి ఆషీర్ మంచం దిగి సొంతంగా నడవడం అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. ప్రస్తుతం బాలుడు పూర్తి ఆరోగ్యంగా నవ్వుతూ తిరుగుతున్నాడు. సరిహద్దులు దాటకుండా, సామాన్యుడికి సైతం అత్యాధునిక కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తూ ఖమ్మం నడిబొడ్డున మానవత్వానికి నిలువెత్తు రూపంగా నిలిచిన డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ సేవా నిరతిపై, ఆసుపత్రి వైద్య బృందంపై జిల్లా వ్యాప్తంగా సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది.

# వనజ మృతిపై జిల్లా వైద్యాధికారి సమగ్ర విచారణ

**గుండాల,ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రిలో విచారణ**

**గుండాల,19జూన్(జనం సాక్షి);** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన గర్భిణీ స్త్రీ మృతిపై ఉన్నత స్థాయి అధికారులు సమగ్ర విచారణ చేపడుతున్నారు .గుండాల ఆసుపత్రి నుంచి ఇల్లందు నుండి ఖమ్మం తరిలించిన సమయంలో ఏం జరిగిందో విచారణ చేపడుతున్నామని, విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డి సి ఎచ్ వో డా.తుకారం, డీసీహెచ్ రవిబాబు అన్నారు. రాష్ట్ర ఆరోగ్యశాఖ కమీషన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఇల్లందు, గుండాల ప్రభుత్వ ఆసుపత్రుల్లో విచారణ చేపట్టారు. గుండాలలో వైద్యాధికారి లేకుండా ఎలాంటి వైద్యం అందించారని డెలివరీ చేసిన సమయంలో ఎవరున్నారని సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. ఆపరేషన చేశారా, నార్మల్ డెలివరీ అయిందా అని వివరాలను సేకరించారు. శంభూనిగూడెం నుంచి ఆంబెలెన్స్ రావడానికి ఎంత సమయం పట్టిందనే విషయాలను తెలుసుకున్నారు. అనంతరం ఇల్లందులో మృతురాలు వనజకు జరిగిన చికిత్స గురించి అక్కడ వైద్యులను ఆరాతీశారు. ఏ పరిస్థితుల్లో ఖమ్మం రిఫర్ చేశారని ప్రశ్నించారు. అనంతరం మృతురాలి స్వగ్రామమైన శంభూనిగూడెం గ్రామాన్ని సందర్శించి కుటుంబాన్ని పరామర్శించారు. గుండాల, ఇల్లందు, ఖమ్మం ఆసుపత్రికి వనజను తీసుకెళ్లిన క్రమంలో ఎలాంటి చికిత్స జరిగిందని, వైద్యుల పనితీరు ఎలా ఉందని అడిగితెలుసుకున్నారు.

# అక్రమ రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ పట్టివేత



**బూర్గంపహాడ్, జూన్ 19 (జనంసాక్షి)** అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని బూర్గంపహాడ్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఎస్సై మేడా ప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బూర్గంపహాడ్ మార్కెట్ యార్డు సమీపంలో సాధారణ తనిఖీలు చేపడుతుండగా లారీ అనుమానాస్పదంగా కనిపించడంతో ఆపి తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జగ్గయ్యపేట నుంచి చత్తీస్గఢ్ రాష్ట్రానికి ఈ రేషన్ బియ్యం తరలిస్తున్నట్లుగా గుర్తించి సుమారు 28 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని లారీని సీజ్ చేసి డ్రైవర్ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

# రోస్టర్ విధానంలో మాలలకు అన్యాయం

- వెంటనే సవరణ చేయాలి
- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి. చెన్నయ్య



**హాలియా, జూన్ 19 జనంసాక్షి:** ఎస్సీ వర్గీకరణ అమలులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రోస్టర్ విధానం వల్ల మాల, మాల అనుబంధ కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి. చెన్నయ్య ఆరోపించారు. హాలియాలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణలో మూడో వర్గానికి ఐదు శాతం రిజర్వేషన్ కేటాయించినప్పటికీ, ఉద్యోగ నియామకాలలో ఆ మేరకు అవకాశాలు కల్పించడం లేదని విమర్శించారు. ఇటీవల జరిగిన ప్రభుత్వ ఉద్యోగ నియామకాలలో మాల సామాజిక వర్గానికి తగిన ప్రాతినిధ్యం లభించలేదని, కొన్ని నియామకాలలో ఒక్క ఉద్యోగం కూడా దక్కలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాల వారీగా అమలు చేస్తున్న ప్రస్తుత విధానం కారణంగా మాలలకు మరింత నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ సమస్యపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి చొరవ తీసుకుని మాలలకు న్యాయం జరిగేలా రోస్టర్ విధానాన్ని సవరించాలని ఆయన కోరారు. అదేవిధంగా నాగార్జునసాగర్ నియోజకవర్గంలో దళితులపై దాడులు జరుగుతున్నాయని, వారిపై అక్రమ కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని సంబంధిత ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. దళితులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని, దీనికి నిరసనగా త్వరలో నిడమనూరులో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని చెన్నయ్య ప్రకటించారు. ఈ సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు, నల్గొండ జిల్లా అధ్యక్షుడు లకుమాల మధుబాబు, రాష్ట్ర యువజన నాయకుడు రమేష్, ఉమ్మడి నల్లగొండ జిల్లా మహిళా అధ్యక్షురాలు పిట్టల భాగ్యమ్మ, మిర్యాలగూడ విభాగ అధ్యక్షుడు చింతమల్ల పాండురంగయ్య, నాగార్జునసాగర్ నియోజకవర్గ అధ్యక్షుడు లకుమాల లింగయ్య, మహిళా నాయకులు లక్ష్మి, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలలో చేరిపిస్తే ఇంటి పన్ను చెల్లిస్తా సర్పంచ్ మణిమాల

**నాంపల్లి, జూన్ 19 (జనంసాక్షి)** ఆచార్య జయ శంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విద్యను ప్రోత్సహిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచేందుకు నాంపల్లి మండలం మల్లపురాజుపల్లి గ్రామ పంచాయతీ సంచలనాత్మక నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి చదివించే కుటుంబాలకు ఇంటి పన్ను, నీటి పన్ను తనే చెల్లిస్తానని సర్పంచ్ మంటిపల్లి మణిమాల అన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో మరింత నమ్మకం పెంచడం, విద్యార్థుల నమోదు శాతాన్ని గణనీయంగా పెంచడం ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మణిమాల మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, తల్లిదండ్రులు ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. గ్రామంలోని ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు. ఈ యొక్క ఇంటి పన్ను తన జీతం నుండి చెల్లిస్తామని తెలియజేసారు. ఈ చారిత్రాత్మక నిర్ణయం ఇతర గ్రామాలకు స్ఫూర్తిగా నిలవనుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# పరిశుభ్రత తోనే ప్రజల ఆరోగ్య రక్షణ ఎంపీడీవో

**వలిగొండ, జూన్ 19 (జనం సాక్షి )** మండలంలోని నాగారం గ్రామాన్ని ఎంపీడీవో జలంధర్ రెడ్డి నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని పరిశీలించిన ఆయన, లబ్ధిదారులు ,మేస్త్రీలు నిర్మాణ పనులను అత్యంత ప్రాధాన్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అలాగే సంబంధిత అధికారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రతి వారం స్థితిగతులను సమీక్షించి నివేదించాలని ఆదేశించారు. అనంతరం శుక్రవారం నిర్వహించే ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని పారిశుధ్ పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించారు. గ్రామంలో నిల్వ ఉన్న మురుగు నీటి ప్రాంతాలు మ,దోమల వ్యాప్తికి అవకాశం ఉన్న ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్‌ను చల్లడం జరిగిందని నిర్ధారించారు. దోమల పెరుగుదలను నివారించి, వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. త్వరలో వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో గ్రామంలో అవసరమైన మందులు , వైద్య సామగ్రి అందుబాటులో ఉండేలా చూడాలని, ప్రజల్లో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామం లో ఎక్కడా డెంగ్యూ మరియు ఇతర ఆరోగ్య సమస్యలు లేవు అని నిర్ధారించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం పి డీ ఓ తో పాటుగా గ్రామ సర్పంచ్ , నాగారం గ్రామ పంచాయతీ కార్యదర్శి, హెల్త్ సబ్ సెంటర్ వైద్య బృందం, గ్రామస్థాయి అధికారులు, సిబ్బంది ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు మంత్రి కోమటిరెడ్డి ఆర్థిక సహాయం

**మూడు కుటుంబాలకు రూ. 10,000 చొప్పున అందజేత**

**మంత్రి ఆదేశాలతో పంపిణీ చేసిన సర్పంచ్ అర్రూరి నరేష్**



**మాద్గులపల్లి, జూన్ 19( జనం సాక్షి):** మండల కేంద్రమైన మాద్గులపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పలువురి కుటుంబాలకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆర్థిక సహాయం అందించి తమ ఉదారతను చాటుకున్నారు. గ్రామానికి చెందిన తల్లమల చంద్రయ్య, కట్ల లింగారెడ్డి, బొల్లం లింగయ్య ఇటీవల అనారోగ్య సమస్యలతో మరణించారు. స్థానిక సర్పంచ్ కాంగ్రెస్ నాయకుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తక్షణమే స్పందించారు. బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని భావించి, ఒక్కో కుటుంబానికి రూ. 10,000 చొప్పున మొత్తం ముగ్గురి కుటుంబాలకు రూ. 30,000 ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. మంత్రి ఆదేశాల మేరకు శుక్రవారం మాద్గులపల్లి సర్పంచ్ అర్రూరి నరేష్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, మంత్రి గారు పంపిన ఆర్థిక సహాయాన్ని వారికి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కష్టకాలంలో ఉన్న పేద కుటుంబాలను ఆదుకోవడంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎల్లప్పుడూ ముందుంటారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఎరుకల వెంకన్న గౌడ్, నాయకులు పింగళిరెడ్డి, కట్ల సిద్ధార్థ రెడ్డి, వెంకటరెడ్డి పార్టీ కార్యకర్తలు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఎండీని కలిసిన మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు

**పోచంపల్లి కి అదనపు బస్సులు కేటాయించాలి**

**ప్రయాణికుల సౌకర్యార్థం సమయానుకూలంగా బస్సులు నడపాలని విజ్ఞప్తి**



**భూదాన్ పోచంపల్లి, జూన్ 19 (జనం సాక్షి):** భూదాన్ పోచంపల్లి ప్రాంత ప్రయాణికుల రవాణా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, అదనపు బస్సులను కేటాయించాలని మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డిని మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోచంపల్లి పరిసర ప్రాంతాల నుండి రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్య పెరుగుతోందని, ప్రస్తుతం ఉన్న బస్సులు సరిపోవడం లేదని ఎండీకి వివరించారు. ప్రయాణికుల సౌకర్యార్థం వివిధ రూట్లలో అదనపు బస్సులను నడపాలని, అలాగే బస్సులన్నీ నిర్ణీత సమయానికి అందుబాటులో ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి సానుకూలంగా స్పందించారు. స్థానిక పరిస్థితులను పరిశీలించి, ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

# ఖుదాబక్ష్‌పల్లిలో ఘనంగా వన మహోత్సవం

**గ్రామసభ నిర్వహణ అనంతరం మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపు**

**మర్రిగూడ, జూన్ 19 (జనంసాక్షి)** పర్యావరణ పరిరక్షణ, గ్రామాభివృద్ధి మరియు హరితహారం లక్ష్యాల సాధనలో భాగంగా ఖుదాబక్ష్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం గ్రామ సర్పంచ్ పందుల జయలక్ష్మి అధ్యక్షతన గ్రామసభను ఘనంగా నిర్వహించారు. గ్రామసభ అనంతరం వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించి గ్రామంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ కలెక్టర్ (ట్రైనీ)వెంకటేశ్వర్లు, ఎంపీడీవో జి.సి. మునయ్య, ఎంపీఓ బి. రవికుమార్, ఈసీవివేక్ సాగర్ హాజరయ్యారు. వారు గ్రామంలో మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ, పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు మొక్కల పెంపకం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షిస్తే గ్రామం పచ్చదనంతో కళకళలాడుతుందని అన్నారు. పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. మండల ఎంపీడీవో జి.సి. మునయ్య మాట్లాడుతూ, గ్రామాల్లో హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని చెప్పారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. గ్రామ సర్పంచ్ పందుల జయలక్ష్మి మాట్లాడుతూ, ఖుదాబక్ష్‌పల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత మరియు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించి వాటిని పెద్ద వృక్షాలుగా పెంచేందుకు గ్రామస్తులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ షబ్బీర్, పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి శ్రీ ప్రసన్న బాబు, గ్రామాధికారులు, హౌసింగ్ ఏఈ, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు, మహిళా సంఘాల సభ్యులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పిడుగుపాటుకు 30 మేకలు మృతి

## సర్పంచ్ జూనేబోయిన గురవయ్య యాదవ్



**మేళ్లచెరువు జనం సాక్షి:**
మండలంలోని రేవూరు గ్రామంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పిడుగు పడి 30 మేకలు మృతి చెందాయి. వర్షం నుండి రక్షణ కోసం వేప చెట్టు కిందకు వెళ్లిన మేకలపై పిడుగు పడటంతో ఈ ప్రమాదం జరిగింది.

**నష్టపోయిన రైతులు:**
అమరబోయిన వీరయ్య: 20 మేకలు
సాథం ఆదినారాయణ: 5 మేకలు
-మూర్తి గంగరాజు: 5 మేకలు
మృతి చెందిన మేకల విలువ సుమారు రూ.4 లక్షలకు పైగా ఉంటుందని అంచనా. రెక్కాడితే గాని డొక్కాడని పేద రైతులు ఈ ప్రమాదంతో తీవ్రంగా నష్టపోయారు. ఈ ఘటనపై రేవూరు గ్రామ సర్పంచ్ జూనేబోయిన గురవయ్య యాదవ్ స్పందించారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి బాధిత రైతులకు నష్టపరిహారం అందించి ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం ఘటనా స్థలాన్ని సర్పంచ్, గ్రామస్థులు పరిశీలించారు.



## నార్కట్‌పల్లి - అద్దంకి హైవేపై పొంచి ఉన్న ప్రమాదం విద్యుత్ తీగలకు వేలాడుతున్న ఫ్లెక్సీ

**మాడుగులపల్లి, జూన్ 19 (జనంసాక్షి):**
నార్కట్‌పల్లి - అద్దంకి ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న మాడుగులపల్లి మండల కేంద్రంలో ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ నుండి కొత్తగూడెం వెళ్లే దారిలో, మెయిన్ హైవే పక్కనే ఉన్న విద్యుత్ లైన్లపై ఒక భారీ ఫ్లెక్సీ ఊడిపడి ప్రమాదకరంగా వేలాడుతోంది నార్కట్‌పల్లి - అద్దంకి రహదారి నిత్యం వేలాది భారీ వాహనాలు, కార్లు, ద్విచక్ర వాహనాలతో అత్యంత రద్దీగా ఉండే ప్రధాన రహదారి ఈ ప్రాంతంలో ఎప్పుడూ వాహనాల రాకపోకలు సాగుతుంటాయి ఇంతటి ప్రాధాన్యత కలిగిన మెయిన్ హైవే పక్కనే, విద్యుత్ స్తంభాల మధ్య ఉన్న రెండు లైన్ల (వైర్ల)పై భారీ ఫ్లెక్సీ పడి రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి ప్రస్తుతం వర్షాకాలం సీజన్ కావడంతో ఎప్పుడు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడుతుందో తెలియని పరిస్థితి ఉంది గాలి తీవ్రతకు ఈ ఫ్లెక్సీ కారణంగా విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగిలి షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది హైవేపై వేగంగా వెళ్లే వాహనాలపై గానీ, కాలినడకన వెళ్లే ప్రయాణికులపై గానీ ఈ లైన్లు తెగిపడితే భారీ ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందని స్థానిక వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..కళ్లముందే ఇంత పెద్ద ప్రమాదం పొంచి ఉన్నా ఇటు విద్యుత్ శాఖ అధికారులు గానీ, అటు స్థానిక గ్రామ పంచాయతీ సిబ్బంది గానీ స్పందించకపోవడం గమనార్హం ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించిన తర్వాత స్పందిస్తారా? అని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు ఇప్పటికైనా ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించకుండా, తక్షణమే స్పందించి హైవే పక్కన ప్రమాదకరంగా వేలాడుతున్న ఆ ఫ్లెక్సీని తొలగించాలని మండల ప్రజలు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.



## సామాజిక న్యాయం, రైతుల సంక్షేమం కోసం పోరాడే నాయకుడు రాహుల్ గాంధీ

**జనంసాక్షి, మిర్యాలగూడ :**
దేశం లో సామాజిక న్యాయం, రైతుల సంక్షేమం కోసం పోరాడే నాయకుడు రాహుల్ గాంధీ అని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం నాడు మిర్యాలగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో రాహుల్ గాంధీ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి పుట్టినరోజువేడుకలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధి దేశం లో ప్రజాస్వామ్య పరిరక్షణ కు, యువత సంక్షేమం మరియు అభివృద్ధి కోసం పాటుపడున్నాడు అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ యొక్క సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, రాహుల్ గాంధీ నాయకత్వం లో పార్టీ పటిష్టం కోసం ప్రతి కార్యకర్త కృషి చెయ్యాలని అన్నారు. ఈ కార్యక్రమం లో పీసీసీ మెంబర్ చిరుమర్రి కృష్ణయ్య, డీసీసీ జిల్లా కార్యదర్శి చిలుకూరు బాలకృష్ణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు పొదిల శ్రీనివాస్, తలకొప్పుల సైదులు, పార్టీ కౌన్సిలర్లు, సర్పంచ్ లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**సూర్యాపేట(జనంసాక్షి):**
ప్రజాసేవే రాహుల్ గాంధీ లక్ష్యమని ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్ లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలలో వారు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ రాహుల్ గాంధీ దేశ ప్రజల హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతున్న ప్రజానాయకుడని కొనియాడారు. దేశ భవిష్యత్తు కోసం అహర్నిశలు కృషి చేస్తున్న నాయకులు రాహుల్ గాంధీ యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. దేశ ప్రజల సమస్యలపై నిరంతరం గళం విప్పుతూ ప్రజల పక్షాన నిలబడుతున్న రాహుల్ గాంధీకి దీర్ఘాయుష్షు కలగాలని, మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రభుత్వ జనరల్ హాస్పటల్ లో పేదలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ వేడుకలలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వర రావు, డీసీసీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ కిషన్ రావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు కరిముల్లా బేగ్ జావేద్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**వలిగొండ, జున్ 19( జనం సాక్షి )**
మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు కేకు కట్ చేసి శుభాకాంక్షలుతెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ... ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రధానిగా చూడాలనేది ప్రజల ఆకాంక్ష అని, భవిష్యత్తులో ఇది సహకారం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పోలేపాక జానకి రాములు ,మార్కెట్ కమిటీ చైర్మన్ భీమా నాయక్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రేసు బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజ్, స్థానిక సర్పంచ్ కుంభ వెంకట పాపిరెడ్డి , ఉపసర్పంచ్ మల్గ మాధవి ,వేములకొండ సర్పంచ్ ఏర్పుల వెంకటేశం , డిసిసి కార్యదర్శి చెరుకు శివయ్య గౌడ్ ,డిసిసి ఎగ్జిక్యూటివ్ మేంబర్ కుర్షిదు, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ పాశం సత్తిరెడ్డి ,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైసోల్ల ప్రవీణ్ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు వాకిటి అనంతరెడ్డి, తుమ్మల యుగంధర్ రెడ్డి, పబ్బు సురేందర్ ,చిలుకూరు సత్తిరెడ్డి ,కాసుల వెంకన్న ,అయిటిపాముల రవి ,పల్సనీ సతీష్ గౌడ్ ,ఉలిపే మల్లేశం,కొండూరు సాయి ,ఎమ్మే మల్లేశం,ఉక్కుర్తి స్వామి ,రేఖల ప్రభాకర్, బద్దం పవన్ కుమార్ రెడ్డి, మధు, మహమ్మద్ ఖాసిం, దండ మల్లికార్జున్, బండి నరసింహ మల్గా నాగులు ,ఆదిమూలం సోమేశ్ ,బంగారు మహిపాల్ ,తదితరులు పాల్గొన్నారు.

## పిడుగు పాటు కు రైతు మృతి



**జనంసాక్షి, మిర్యాలగూడ :**
గురువారం సాయంత్రం కురిసిన అకాల వర్షం లో పిడుగు పడి రైతు మృతి చెందిన సంఘటన మిర్యాలగూడ మండలం లో చోటుచేసుకున్నది. మండల పరిధిలో లోని జేత్యా తండా గ్రామ పంచాయతీ పరిధిలో లోని సామ్యా తండా ఆవాస గ్రామ పరిధిలోని మాలోత్ కోటయ్య వయసు 40 సంవత్సరాలు గురువారం గొర్రెలు మేపడం కోసం వెళ్ళాడు. సాయంత్రం వర్షం ప్రారంభం కావడం తో సమీపంలో గల చెట్టుకిందకి వెళ్లడం జరిగింది. ఆ చెట్టు పై పిడుగు పడటం తో కోటయ్య అక్కడికక్కడే మృతి చెండటం జరిగింది. మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు కలరు.

## రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి

**సూర్యాపేట (జనంసాక్షి):**
రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రెడ్ హౌస్ లో ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్యను నూతనంగా ఎన్నికైన రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తానని అన్నారు. ప్రజలకు రేషన్ సేవలు సక్రమంగా అందజేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ కిషన్ రావు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె. ఖాజామోహినుద్దీన్, డివిజన్ అధ్యక్షులు గార్లపాటి ఎల్లారెడ్డి, వివిధ మండలాల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



## ప్రత్యేక ఓటర్ జాబితా సవరణకు రాజకీయ పార్టీలు సహకరించాలి

### హుజూర్ నగర్ ఆర్డీవో శ్రీనివాసులు

**నేరేడుచర్ల (జనంసాక్షి):**
ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - సర్ ) కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో రాజకీయ పార్టీలు సహకరించాలని హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల పట్టణంలోని టౌన్ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లకు( బిఎల్ఎ) ప్రత్యేక శిక్షణ అందించారు. ఓటర్ల జాబితాలో పేర్లు మార్చడం, తొలగించడం,సవరణ చేయడం వంటి అంశాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ..రాజకీయ పార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలతో సమన్వయం చేసుకుంటూ ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియ సజావుగా జరిగేలా సహకరించాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం, పారదర్శకంగా, నిష్పక్ష పాతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అధికారులు చర్యలు చేపడుతున్నారని, ప్రజలు కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సురిగి సైదులు,ట్రైనర్ శ్రీను,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు అందరూ భాగస్వాములు కావాలి

## ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం



**రామన్నపేట, జూన్ 19 (జనంసాక్షి):** పర్యావరణ పరిరక్షణకు అందరూ భాగస్వాములు కావాలనీ ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో వన మహోత్సవంలో భాగంగా రామన్నపేట మండల కేంద్రంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మొక్కలు మానవ మనుగడకు మూలమని తెలియజేశారు. ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మొక్కలు నాటడం మాత్రమే కాదు వాటి సంరక్షించడం కూడా ఎంతో ముఖ్యమని అన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు నోటు బుక్స్ పంపిణీ చేసి విద్యార్థికి ఎల్లప్పుడు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. విద్యార్థులు మంచి లక్ష్యాలతో ముందుకు సాగి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. యువత సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని సేవాభావంతో ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో తహసిల్దార్ లాల్ బహదూర్ శాస్త్రి, ఎంపీడీవో ఆవుల రాములు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పున్న జగన్మోహన్, జిల్లా డిసిసి కార్యదర్శి కొత్తపల్లి అబ్రహం కుమార్, వలిగొండ రామన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు గంగుల వెంకట్ రాజిరెడ్డి, జినుకల ప్రభాకర్, స్థానిక సర్పంచ్ గరిక సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు ఎండి జమీరుద్దీన్, మండల యువజన అధ్యక్షులు బట్టే సంతోష్ కుమార్, సాల్వేర్ అశోక్, గుత్తా నర్సిరెడ్డి, ఎండి రెహాన్, బొడ్డు సురేందర్రావు, జెల్ల వెంకటేష్, రామిని రమేష్, వనం చంద్రశేఖర్, కోట సుధాకర్, ఎండి అక్రమ్,మోటె రమేష్, మోటే మహేష్, కొమ్ము శేఖర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**కొండమల్లేపల్లి, జూన్ 19 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కొండమల్లేపల్లి తహసిల్దార్ నరేందర్ కు స్వర్ణకారులందరూ సమిష్టిగా కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ 272 జిఓ కచ్చితంగా అమలు చేసి అక్రమ రికవరీలనుండి కాపాడాలని 50 సంవత్సరాలు వయస్సు దాటిన నిరుపేద స్వర్ణకారులకు నేత గీత కార్మికుల మాదిరిగా నెలకు అయిదు వేల రూపాయలు పెన్షన్ మంజూరు చెయ్యాలని మార్వాడి కార్పొరేట్ జ్యువలరీ షాపులను నియంత్రించి వెండి, బంగారం కార్మికులకు ఇరవై లక్షల రూపాయలు వడ్డీ లేని రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని, విపరీతంగా పెరిగిన వెండి, బంగారం ధరల కారణంగా పనులు నడవక అప్పులపాలయి ఆత్మహత్యలకు పాల్పడుతున్న కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ రాష్ట్ర, నల్గొండ జిల్లా సంఘం పిలుపు మేరకు వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్వర్ణకార సంఘం ప్రచారకార్యదర్శి దారోజు భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షులు కర్నెకంటి అచ్యుత్ చారి, సహాయ కార్యదర్శి కొండోజు వినోద్, మండల అధ్యక్షులు మోర కిరణ్ బాబు, మాజీ అధ్యక్షులు మల్లోజు వీరాచారి, గౌరోజు శేఖర్, సుభాని, వెంకటేష్,అశోక్, హరికృష్ణ, పెరికేటి శేఖరాచారి, జానీ, పాండు, గౌరోజు శ్రీనివాసచారి, నాగారత్న చారి తదితరులు పాల్గొన్నారు.



# సీఎం సహాయ నిధి పేదలకి వరం

## ఎమ్మెల్సీ కోటిరెడ్డి

**జనంసాక్షి, మిర్యాలగూడ :** సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్సీ ఎం.సి. కోటిరెడ్డి అన్నారు. శుక్రవారం నాడు మిర్యాలగూడ లోని తన క్యాంప్ కార్యాలయం లో మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లోని వివిధ గ్రామాలకు చెందిన 17 మందికి 5,77,000/-రూపాయల విలువ గల చెక్కు లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరు పేదలు సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో చెన్నారం సర్పంచ్ తులసిరామ్, సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ సాధినేని శ్రీనివాస్, గజ్జల కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ విజయవంతం చేయాలి

## దేవరకొండ ఆర్డిఓ పద్మప్రియ

**కొండమల్లేపల్లి, జూన్ 19 (జనంసాక్షి):** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతానికి బూత్ లెవల్ అధికారులు కీలక పాత్ర పోషించాలని దేవరకొండ ఆర్డిఓ పద్మప్రియ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారుల శిక్షణా తరగతుల కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం బూత్ లెవెల్ అధికారులను ఉద్దేశించి ఆర్డీఓ మాట్లాడుతూ బూత్ లెవెల్ అధికారులు ప్రతి ఓటర్ ఇంటింటికి వెళ్లి వివరాలను సేకరించి ధృవీకరించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా చేర్చడానికి, సవరణలు చేయడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. కొత్తగా 18 ఏళ్లు నిండిన యువత ఓటరు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఓటరు జాబితాలో పేర్లు లేకపోవడం లేదా తప్పులు ఉంటే సరిచేసుకోవడానికి ప్రజలు ప్రజాప్రతినిధులు పూర్తి సమాచారం అందించాలన్నారు. ప్రతిఒక్క అర్హుడి ఓటు తొలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. భారత ఎన్నికల సంఘం జారీ చేసిన డిక్లరేషన్ ఫారాలను ప్రతి ఓటరుకు అందజేసి వాటి స్వీకరణకు సంబంధించిన అంగీకార పత్రాన్ని (అక్నాలెడ్జ్మెంట్) తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ నరేందర్, ఎలక్షన్ డిటి ప్రశాంత్, ఆర్ఐ శ్రీనివాస్, ఆంజనేయులు, మాస్టర్ ట్రైనర్లు కట్టెబోయిన శ్రీనివాసులు, వాసికర్ల రమేష్, బిఎల్వోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# తేల కంటి గూడెం మాజీ సర్పంచ్ కి పితృవియోగం..

**కనగల్లు, జూన్ 19 (జనంసాక్షి)** మండలంలోని తేల కంటి గూడెం మాజీ సర్పంచ్ బైరగోని వెంకన్న గౌడ్ తండ్రి భైరగొని రామచంద్రయ్య గౌడ్ అనారోగ్యంతో మృతి చెందాడు. రామచంద్రయ్య గౌడ్ మృతి చెందిన వార్తను గ్రామ బి ఆర్ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డికి సమాచారం ఇవ్వడంతో శుక్రవారం బి ఆర్ఎస్ నాయకులతో కలిసి రామచంద్రయ్య మృతదేహాన్ని సందర్శించి ఆయన పార్టీల దేశంపై పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు అయితగోని యాదయ్య గౌడ్, కనగల్, జి ఎడవల్లి, పీఏసీఎస్ చైర్మన్ లు వంగాల సహదేవరెడ్డి, డి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కరీం పాషా, మాజీ సర్పంచ్ కడారి కృష్ణయ్య, హౌ రేస్ శీను, బి ఆర్ఎస్ నాయకులు బోయపల్లి జానయ్య గౌడ్, ఎర్ర మాద వెంకటరెడ్డి, సుంకిరెడ్డి వెంకటరెడ్డి, దీప వెంకటరెడ్డి, మారగోని గణేష్, నామ నగేష్, శ్రీను, దండం పెల్లి సత్తయ్య మాతంగి అమర్, బి ఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ బుర్రి శ్రీమన్ కుమార్, తదితరులున్నారు.

# ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు..!



**పి.ఏ.పల్లి,జూన్ 19(జనంసాక్షి) :** భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత,లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను పి.ఏ.పల్లి మండల కేంద్రంలో సూర్య హాస్పిటల్ ఎండి డాక్టర్ పాల్వాయి వెంకట్ రెడ్డి ,మాజీ ఎంపీపీ తేరా సత్యనారయణరెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయ కులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన అనంతరం స్వీట్లు,పండ్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాహుల్ గాంధీ దేశ ప్రజల హక్కులు,రాజ్యాంగ పరిరక్షణ,సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతున్న ప్రజా నాయకుడని వారు కొనియాడారు. యువతకు ఆదర్శంగా నిలుస్తూ,దేశ భవిష్యత్తు కోసం అహర్నిశలు కృషి చేస్తున్న నాయకుడు రాహుల్ గాంధీ అని అన్నారు. దేశ ప్రజల సంక్షేమం కోసం మరిన్ని సేవలు అందిస్తూ,ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ రాహుల్ గాంధీకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్య హాస్పిటల్ డాక్టర్ పాల్వాయి వెంకటరెడ్డి,మాజీ ఎంపీపీ తేర సత్యనారాయణ రెడ్డి,స్థానిక సర్పంచ్ వంగాల శ్రీనివాస్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు ముత్తయ్య, పోతెం శంకర్,గున్నెబోయిన నాగేష్,అకనబోయిన మధు,లచ్చిరాం నాయక్, రాజు, కోటేష్,కోటి, రామస్వామి,రామచంద్రం,కట్టెబోయిన ఏల్లేష్,ధర్మపురం మల్లేష్,తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్న గాంధీజీ విద్యార్థిని కందుల దివ్య

**చండూరు, జూన్ 19 (జనంసాక్షి)**
మార్చి 2026 పదవ తరగతి ఫలితాల్లో 579 మార్కులు సాధించిన గాంధీజీ స్కూల్ విద్యార్థిని కందుల దివ్య ను తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారు ప్రశంసా పత్రం అందించి, అభినందించారు. పేద కుటుంబంలో జన్మించిన కందుల దివ్య జి.యడవల్లి గ్రామం నుండి ప్రతిరోజు చండూరు రావడానికి ఇబ్బంది పడి, చండూరులోని షెడ్యూలు కులముల అభివృద్ధి శాఖ వారి బాలికల వసతి గృహంలో సీటును పొంది అక్కడే ఉంటూ గాంధీజీ పాఠశాలలో చదువుకుంది. ఈ సంవత్సరం మార్చి నెలలో జరిగిన పదవ తరగతి పరీక్షల్లో 579 మార్కులతో ఉత్తమ ఫలితాన్ని సాధించింది. బాలికల వసతి గృహంలో ఉంటూ నల్లగొండ జిల్లాలోనే అత్యధిక మార్కులు సాధించినందుకు గాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం నాడు లాల్ బహుదూర్ స్టేడియం నందు ప్రశంసా పత్రం అందుకుందని గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్, చండూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, హాస్టల్ వార్డెన్ రమ్యశ్రీ తెలిపారు. కందుల దివ్య ను అతని తల్లిదండ్రులను తోటి స్నేహితులు, ఉపాధ్యాయులు అభినందించి, భవిష్యత్తులో దివ్య ఉన్నత స్థానంలో ఉండాలని ఆశించారు.



## మృతుల కుటుంబాలకు పది వేల రూపాయల సాయం

**తిరుమలయపాలెం, ( జనం సాక్షి) :** మండల పరిధిలోని గోల్ తండా, జింకలగూడెం గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబాలకు పి ఎస్ ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పది వేల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ మరియు సమాచార శాఖ మంత్రి ఆదేశాల మేరకు ఈ సహాయాన్ని పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివ రామకృష్ణ అందించారు. కార్య క్రమంలో మాజీ ఎంపీపీ మంగిలాల్, సర్పంచ్ బాణోత్ సుజాత అనిల్ కుమార్, షేక్ నజీర్, మాజీ ఎంపీటీసీ అంబేద్కర్, సయ్యద్ సైదా, బాణోత్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.





## డిప్లొమా స్టూడెంట్స్ కు ముగిసిన శిక్షణ కార్యక్రమం

**సూర్యాపేట (జనంసాక్షి):**
2026- 27 విద్యా సంవత్సరం నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్న అక్క మెంటార్షిప్ కార్యక్రమం గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఆ కళాశాల ప్రిన్సిపల్ కె.సుజాత అధ్యక్షతన కళాశాల నోడల్ ఆఫీసర్స్, డిప్లొమా చివరి సంవత్సరం చదివే విద్యార్థినులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిప్లొమా చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఉద్దేశించబడిన కార్యక్రమం అని తెలిపారు. విద్యార్థులు సమీప ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు కృత్రిమ మేధా, డిజిటల్ అక్షరాస్యత, డిజిటల్ టూల్స్, ఆధునిక సాంకేతికత, సాంకేతిక సురక్షిత వంటి అంశాలపై జూలై 1 నుండి 30 వరకు పాటు బోధించాల్సి ఉంటుందని తెలిపారు. దీనికిగాను ప్రతి విద్యార్థికి ఒక అకాడమిక్ క్రెడిట్ ను కూడా ఇస్తారని అన్నారు. మాస్టర్ ట్రైనర్ గా పి.రత్తయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ సీఎస్ఈ డిపార్ట్మెంట్, శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల నోడల్ ఆఫీసర్స్ ఎన్.సురేష్, బి.అన్వేష్, చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి : నాంపల్లి సీఐ దూది రాజు

**మర్రిగూడ, జూన్ 19 (జనంసాక్షి)**
ప్రజలు తమ న్యాయపరమైన వివాదాలను దీర్ఘకాలం కోర్టుల్లో కొనసాగించకుండా సామరస్యపూర్వకంగా పరిష్కరించు కునేందుకు జాతీయ లోక్అదాలత్ ఒక మంచి వేదికగా నిలుస్తుందని నాంపల్లి సీఐ దూది రాజు తెలిపారు. ఈ నెల 20వ తేదీన (శనివారం) నిర్వహించనున్న జాతీయ లోక్అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అనేక సివిల్, క్రిమినల్, బ్యాంకు రికవరీ, చెక్కు బౌన్స్ తదితర కేసులను పరస్పర రాజీ ద్వారా త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం లోక్అదాలత్ ద్వారా కలుగు తుందని పేర్కొన్నారు. సాధారణంగా కోర్టు కేసులు సంవత్సరాల తరబడి కొనసాగు తుండటంతో బాధితులు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటారని, లోక్అదాలత్ ద్వారా అలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. లోక్అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవడం వల్ల కోర్టు ఫీజులు, న్యాయవాదుల ఖర్చులు తగ్గడంతో పాటు విలువైన సమయం కూడా ఆదా అవు తుందని సీఐ తెలిపారు. అంతేకాకుండా, ఇరువర్గాలు పరస్పర అంగీకారంతో రాజీ కుదుర్చుకోవడం వల్ల భవిష్యత్తులో వివాదాలు పునరావృతం అయ్యే అవకాశాలు కూడా తగ్గుతాయని చెప్పారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల భారాన్ని తగ్గించడంలో కూడా లోక్అదాలత్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రత్యేకించి కుటుంబ వివాదాలు, భూ సంబంధిత తగాదాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివాదాలు, బ్యాంకు రుణాల వసూళ్ల కేసులు వంటి అంశాల్లో లోక్అదాలత్ మంచి ఫలితాలను ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలకు సామరస్యపూర్వక పరిష్కారం పొందాలని సూచించారు. నాంపల్లి, చింతపల్లి, మర్రిగూడ మండలాల పరిధిలోని ప్రజలు తమ కేసులకు సంబంధించిన పూర్తి వివరాలతో సంబంధిత న్యాయస్థానాలు, పోలీసు అధికారులు లేదా న్యాయసేవా సంస్థలను సంప్రదించి జాతీయ లోక్అదాలత్‌లో పాల్గొనాలని సీఐ దూది రాజు కోరారు. ప్రజలకు త్వరితగతిన, తక్కువ ఖర్చుతో న్యాయం అందించడమే లోక్అదాలత్ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.



## ఖుదాబక్ష్‌పల్లిలో ఘనంగా వన మహోత్సవం

### గ్రామసభ అనంతరం మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపు

**ఖుదాబక్ష్‌పల్లి, జూన్ 19 (జనంసాక్షి):**
ఖుదాబక్ష్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలో గ్రామ సర్పంచ్ పందుల జయలక్ష్మి అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. అనంతరం వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించి గ్రామంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ కలెక్టర్ (ట్రైనీ) శ్రీ వెంకటేశ్వర్లు, మండల ఎంపీడీవో జి.సి. మునయ్య, మండల ఎంపీఓ బి. రవికుమార్, ఈసీ వివేక్ సాగర్ హాజరై మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, హరితహారం లక్ష్యాలు మరియు మొక్కల పెంపకం ప్రాముఖ్యతపై అధికారులు మాట్లాడారు. నేడు నాటిన ప్రతి మొక్క రేపటి తరాలకు ప్రాణవాయువును అందించే అమూల్యమైన సంపద అని పేర్కొన్నారు. గ్రామాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి మొక్కలను నాటి వాటి సంరక్షణలో భాగస్వాములు కావాలని అధికారులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ షేక్ షబ్బీర్, పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ప్రసన్న బాబు, గ్రామాధికారులు, హౌసింగ్ ఏఈ, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మదర్ డైరీ రైతుల క్షేమమే ధ్యేయం: సందిల భాస్కర్ గౌడ్

**రాజాపేట జూన్19(జనంసాక్షి):**
మదర్ డైరీ రైతుల శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించనున్నట్లు మదర్ డైరీ డైరెక్టర్ సంధిల భాస్కర్ గౌడ్ అన్నారు. శుక్రవారం రాజాపేట పాల సొసైటీ లో ఎన్నికలు జరుగగా ఎన్నికల అధికారి రామచంద్ర రెడ్డి నిర్వహించారు. చైర్మన్ గా సందిల భాస్కర్ గౌడ్ వరుసగా 3వ,సారి ఏకగ్రీవము గా ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా దోమల లక్ష్మణ్,, ఎర్రగోకుల పోషమ్మ,, రేగు కనకయ్య, చింతల సత్తయ్య లను ఏకగ్రీవముగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమలో బీజేపీ జిల్లా అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్, రాజాపేట సర్పంచ్ కోయ మధు, మాజీ చైర్మన్లు దోమల బాల పోశయ్య, సట్టు తిరుమలేష్ , చల్మలపల్లి లక్ష్మణ్, దాచేపల్లి రాజు, కాకల్ల ఉపేందర్, గాండ్ల నర్సింగరావు, బేడిద నర్సిములు, డైరెక్టర్లు చల్మలపల్లి నాగ రాజు, సిగుల్ల సిద్ధులు, బిల్లకుదురు కృష్ణ, అమ్మాపురం పద్మ, రేగు అనిల్ కుమార్, మాజీ డైరెక్టర్లు పాడి రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు. భాస్కర్ గౌడ్ నూతన డైరెక్టర్లను సన్మానించారు.



## అక్రమ అరెస్టుతో పోరాటాన్ని ఆపలేరు : నాగరాజు రాథోడ్

**పాలకవీడు జూన్ 19( జనంసాక్షి) :**
మండలంలో జాన్ పహాడ్ దర్గా వద్ద జరుగుతున్న అక్రమ వసూలు దౌర్జన్యాలు అన్యాయంగా భక్తుల మీద దాడి చేయడం అధికారికంగా కాంట్రాక్టు లేని పక్షంలో భక్తుల వద్ద నుండి అధిక మొత్తంలో వసూలు చేస్తున్న దళారుల గుత్తేదారుల ప్రమేయం లేకుండా చెయ్యాలనే ఉద్దేశంతో జానపహాడ్ దర్గా వద్ద చేపడుతున్న ధర్మ పోరాటంను అక్రమ అరెస్టులు, ప్రివెంటివ్ అరెస్టులు చేసి ఆపలేరుఅని జాన పహాడ్ దర్గా కల్మెట్ తండ ఉప సర్పంచ్ నాగరాజు రాథోడ్ అన్నారు. చట్టం ప్రకారమే దర్గా ఇన్స్పెక్టర్,సూర్యాపేట జిల్లా కలెక్టర్ , వక్ఫ్ బోర్డు చైర్మన్ సీఈవోలకు రాతపూర్వకంగా దరఖాస్తు ఇచ్చినా కానీ వక్ఫ్ బోర్డ్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు చేశాడు. నిరసన కార్యక్రమం చేపట్టడానికి నిర్ణయించగా పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్ కు తీసుకువచ్చారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి అక్కడ అధికారికంగా టెండర్ ప్రక్రియ రేట్ల పట్టికను ఏర్పాటు చేయాలని లేనిచో భవిష్యత్తులో మరిన్ని నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



# ప్రతిఒక్కరు విద్యను అభ్యశించాలి

## షేఖ్ అబ్దుల్ బాసిత్ జమాతే ఇస్లామి హింద్ సభ్యులు..



చదు సంస్కారం నేర్పుతుంది. నైతిక విలువలతో కూడిన చదువును ప్రతిఒక్కరు అర్జించాలని ప్రవక్త ముహమ్మద్ 1450 సంవత్సరాల క్రితమే బోధించారని జమాతే ఇస్లామి హింద్ సభ్యులు షేఖ్ అబ్దుల్ బాసిత్ అన్నారు.పవిత్ర శుక్రవారం సందర్బంగా మస్జీద్ ఏ వహీద్ లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్ధనలో పాల్గొని ఆయన మాట్లాడుతూ. నేడు మానవతా విలువలతో కూడిన విద్య కనుమరుగయ్యా పోతుంది అని, ఆర్జించిన జ్ఞానాన్ని మానవ హితం కన్నా మానవ వినాశనానికే ఎక్కువగా ఉపయోగించబడుతుంది అని ఆవేదన వ్యక్తం చేసారు.నేడు విద్య వ్యాపార వస్తువుగా మారిపోయింది అని, విద్యను డబ్బు సంపాదనే దేయంగా మారిపోయింది అని ఫలితంగా మనుషులు మద్య సత్ సంబంధాలు కనుమరుగు అయ్యాయని అన్నారు.ఇస్లాం జ్ఞానాన్ని మానవ హితం కోసం ఆర్జించాలని కొరుతుంది. విద్య నిజ దైవాన్ని గుర్తించి, చావు పుట్టుక నడుమ జీవిత మర్మాన్ని తెలుసుకుని జీవించేలా చేయాలని ఆకాంక్షిస్తుందన్నారు.తల్లిదండ్రులు తమ సంతానానికి ఇచ్చే అత్యత్తమ బహుమానం చక్కని చదువు సంస్కారాలే అని, చదువును సమాజ హితం కోసం కాకుండా, స్వార్థం స్వలాభం కోసం వినియోగిస్తే నరక శిక్ష అనుబవించ వలసి ఉంటుంది అని హెచ్చరించారని అన్నారు.ఎప్పుడు? ఎక్కడ? ఎలా? ముగిసి పోతుందో తెలియని క్షణ భంగుర ప్రాపంచిక మాయలో పడకుండా, ఆర్జించిన జ్ఞానాన్ని సాటి మానవాళి బాగు కోసం వినియోగించాలని కోరారు.ఈ కార్యక్రమం లో మౌలానా గౌసుద్దీన్. అజ్వార్ బేగ్, జబ్బార్ గాజీసలావుద్దీన్, మంజర్, తదితరులు పాల్గొన్నారు.

# రూ.8.69 కోట్ల అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

## ఎదులాపురం మున్సిపల్ సాధారణ సమావేశంలో కీలక తీర్మానాలు



**ఖమ్మం రూరల్, జూన్ 19 (జనంసాక్షి)**
ఏదులాపురం మున్సిపాలిటీ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం ఛైర్‌పర్సన్ పోకబత్తిని అనిత అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో పట్టణ అభివృద్ధికి సంబంధించిన రూ. 8.69 కోట్ల విలువైన వివిధ పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.వీధి లైట్ల నిర్వహణ, ఎల్ఈడీ బల్బులు, విద్యుత్ పరికరాల కొనుగోలు, ఇంజినీరింగ్ విభాగానికి అవసరమైన సామగ్రి, వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన, సివిల్ పనులు, బడ్జెట్ అంచనాలు, బిల్లుల చెల్లింపులు, టెండర్లకు సంబంధించిన ప్రతిపాదనలను సమావేశంలో ఆమోదించారు.ఈ సమావేశంలో వైస్ ఛైర్ పర్సన్ తమ్మినేని నవీన్, కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, మేనేజర్ శ్రీనివాస్, ఆర్ఐలు శ్రీధర్ రెడ్డి, రఘు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో

# ఆర్థిక సాయంగా లక్ష 20 వేలు అందజేత

**పెనుబల్లి, జూన్ 19(జనం సాక్షి )**
మృతుడు నాదెండ్ల శ్రీనివాస రావు కుటుంబ సభ్యులకి ఆర్థిక సహాయంగా లక్ష ఇరవై వేల రూపాయలు బ్యాంక్ డిపాజట్ రూపంలో శనివారం పెనుబల్లి మండల కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో అందజేశారు. పెనుబల్లి మండలానికి చెందిన నాదెండ్ల శ్రీనివాసరావు ఇటీవల వడదెబ్బతో మృతి చెందాడు. ఆయనకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అండ కోల్పోయిన కుటుంబానికి ఆర్థిక సహాయం అందించేందుకు లింగగూడెం,పెనుబల్లి కుప్పెనకుంట గ్రామాలకు చెందిన కమ్మ సేవా సమితి సభ్యులు ఈ మొత్తం నగదు బ్యాంకు డిపాజిట్ ద్వారా శ్రీనివాసరావు కుమార్తెల భవిష్యత్ అవసరాల నిమిత్తం అందజేశారు. కార్యక్రమంలో కమ్మ సేవా సంఘం మండలనాయకులు చింతనిప్పు సత్యనారాయణ, చీకటి రామారావు, మోరంపూడి బాబురావు, విం ఎం.బంజర్ ఉప సర్పంచ్ తాళ్లూరు రవి, గోగినేని రమేష్, పీవీ ప్రసాద్,ముత్తుం సత్యనారాయణ, వివి రామారావు, సుంకర సత్యనారాయణ, గద్దె శ్రీనివాసరావు,ఆళ్ల రమేష్, కారుమంచి ఆనంద్, పొట్రూ వెంకటేశ్వరరావు. తదితరులు ఉన్నారు.



# రైతు భరోసా వెంటనే అమలు చేయాలి

## మాజీ జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు




**మధిర, జూన్ 19 (జనంసాక్షి):**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ముఖ్యంగా అర్హులైన రైతులందరికీ రైతు భరోసా నిధులను తక్షణమే విడుదల చేయాలని ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, మధిర నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ లింగాల కమల్ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మధిర నియోజకవర్గంలో పరిపాలన పూర్తిగా పడకేసిందని, ప్రస్తుతం ఇక్కడ దళారుల రాజ్యం నడుస్తోందని మండిపడ్డారు.గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 'రైతుబంధు' పథకం కింద రైతుల ఖాతాల్లోకి సకాలంలో నిధులు జమ కావడంతో వారు సంతోషంగా ఉండేవారని, కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు భరోసా ఇవ్వడంలో విఫలమైందని విమర్శించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ప్రజా సమస్యల పరిష్కారం కంటే కమిషన్ల మీదనే ఎక్కువ శ్రద్ధ ఉందని, రైతు సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఆయన ఆరోపించారు.?

**జూన్ 22న నియోజకవర్గ స్థాయి శిక్షణ సమావేశం**

మధిర మండలం దెందుకూరు గ్రామంలోని ఎస్ ఆర్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ ముఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు కమల్ రాజు తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంలో భాగంగా నియమించబడిన బూత్ లెవెల్ ఏజెంట్లకు (బి ఎల్ ఏ), పార్టీ సభ్యత్వ నమోదు సమన్వయకర్తలకు ఈ సమావేశంలో శిక్షణ ఇవ్వనున్నారు అని తెలిపారు.ఈ కార్యక్రమానికి ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జ్ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు, సభ్యత్వ నమోదు ఇంచార్జ్ నామ నాగేశ్వరరావు,ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు తాతా మధు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు, అభిమానులను ఆయన కోరారు.?ఈ సమావేశంలో బిక్కి కృష్ణ ప్రసాద్,పల్లపోతు వెంకటేశ్వరరావు,రావూరి శ్రీనివాసరావు, చిత్తారు నాగేశ్వరరావు, వంకాయలపాటి నాగేశ్వరరావు, రంగిశెట్టి కోటేశ్వరరావు, బొగ్గుల భాస్కర్ రెడ్డి, కౌన్సిలర్ వైవి అప్పారావు, మాజీ కౌన్సిలర్ దీరావత్ మాధవి, రాఘవరావు, కటికల సత్యనారాయణ రెడ్డి, బొగ్గుల వీరారెడ్డి, బుర్రి బాబురావు, ఐలూరి ఉమామహేశ్వర్ రెడ్డి, ఆళ్ల నాగబాబు, పరిస శ్రీనివాసరావు, చీదిరాల రాంబాబు, వేల్పుల శివ, కుర్ర రంజిత్, అబ్బూరి రామన్ తదితరులు పాల్గొన్నారు.

# మీ అహంకారం వల్లే మీకు ఓటమి

- మండల కాంగ్రెస్ అధ్యక్షులు నల్లమోతు వెంకట రమణ
- కల్వకుంట్ల తారక రామారావు విమర్శలను తిప్పికొట్టిన కాంగ్రెస్

**చంద్రుగొండ, జూన్ 19( జనం సాక్షి):**
పది సంవత్సరాల కాలంలో మీ అహంకారపూరితమైన నిర్ణయాలు పాలనతోటే ప్రజలు విసిగి వేసారి కాంగ్రెస్కు పట్టం కట్టారని ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని బిఆర్ఎస్ పార్టీ ప్రతిపక్ష హోదా హుందాతనని నిలుపుకోవాలని చంద్రుగొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోతు వెంకటరమణ విమర్శించారు . ఖమ్మంలో ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ పార్టీ సమావేశంలో కల్వకుంట్ల తారక రామారావు విమర్శలకు ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారంటే వారి సత్తా ఏంటో మీకు ఇప్పటికే అర్థమైందని అయినా ఇంకా అవాకులు చవాకులు ఖమ్మం జిల్లా కొచ్చి మాట్లాడటం నీ విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చాలెంజ్ చేసి మరీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బిఆర్ఎస్ పార్టీకి చుక్కలు చూపించిన సంగతి మరిచిపోయారా అని ఆయన మాటలను ఖండిస్తూ విమర్శించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఒక్కొక్కటిగా హామీలను నెరవేరుస్తూ ఏ ఎన్నిక జరిగిన కాంగ్రెస్ పార్టీకి విజయం చేకూరుస్తూ వచ్చిన ప్రజలు రాబోయే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీగెలుపకు పట్టం కట్టడంఖాయం అని మాజీ జెడ్పిటిసి అంకిరెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఎక్కడ సమావేశం ఏర్పాటు చేసిన ఆ పార్టీలో కుమ్మలాటలు బయటపడుతున్న అవి పట్టించుకోకుండా ఇంకా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేసుకుంటూ పోతే రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా దక్కదని సీనియర్ కాంగ్రెస్ నాయకులు భోజ్య నాయక్ విమర్శించారు. తొలుత జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇస్రావత్ రుక్మిణి ఉపసర్పంచ్ రామకృష్ణ,యూత్ కమిటీ కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్, బొర్రా సురేష్, భోగిన బోయిన కోటేశ్వరరావు, గుగులోతు బాబు, సారేపల్లి శేఖర్, ప్రసాద్,ఇంజమ్ అప్పారావు, శంకర్ పుల్లయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

